# అన్వేషణ

**- దూరి వెంకటరావు**

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండంలా ఉంది ప్రభ అంతరంగం.

రెండ్రోజులబట్టి డ్యూటీకెళ్ళలేదు.

లీవ్‌లెటరు పంపాలన్న ధ్యాసే లేదు.

చెప్పపెట్టకుండా ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళని భర్త వారం రోజుల నుంచి కనిపించకపోయేసరికి ఆమె మనసు పరిపరివిధాల పోతోంది. తనకు తెలీకుండా నిర్వహించే రాచకార్యాలేం ఉన్నాయి ఈ మనిషికి? ఎక్కడికి వెళ్ళినట్లు? పొద్దున్నుంచి కుడి కన్ను అదేపనిగా బెదుర్తూ తనను మరింతగా బెదిరిస్తోంది. ఇరవైనాలుగు గంటలూ ఆమె చూపు వీధి వంకే ఉంది.

"కృష్ణబాబు ఉన్నారమ్మా" గేటు తీసుకుని లోపలికొస్తూ అడిగిందో మహిళ.

మాసిన చీర, తైల సంస్కారం లేని జుట్టులో వికారంగా ఉంది.

'నా పెనిమిటితో నీకేంపని' అన్నట్లు చిరాగ్గా చూసింది ప్రభ.

"వారు ఈ ఇంట్లో ఉంటున్నట్లు తెలిసి వచ్చానమ్మా" ఆమె కంఠంలో కంగారు.

కళ్ళల్లో ఆశ...

"ఇంతకీ నువ్వెవరు? ఎందుకొచ్చావో చెప్పు."

"నాపేరు కమల. వారు నా భర్త. వీళ్ళు నా పిల్లలు." చంకనున్న చంటిపిల్లను క్రిందికి దింపుతూ అందామె.

గుండెలమీద పిడుగుపడ్డట్టైంది ప్రభకి. వెంటనే తేరుకుని "ఏవిటా వాగుడు? ఎవర్ని గురించి ఎవరనుకుంటున్నావ్. వెళ్ళు ఇక్కడ నుంచి" కసురుకుంది.

"లేదమ్మా ఆయన నాకు తాళి కట్టిన భర్త. అదుగో వారే" అంటూ గోడకు తగిలించివున్న ఫోటోను చూపిస్తూ అన్నది కమల.

అంటే నా భర్త ముందే వివాహితుడా? పెళ్ళాం, పిల్లలు ఉండగా నన్నెందుకు కట్టుకున్నట్లు? ఎదురుగా నిలబడ్డ స్త్రీ తన సవితి అన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతోంది ప్రభ.

లోపలనుండి వాళ్ళ సంభాషణ విన్న జగధీశ్వరి గబగబా బయటకొచ్చి "చూడు తల్లీ, అతడు నీకే మౌతాడో మాకు అనవసరం. ఇప్పుడు ఇక్కడ లేడు. ఎక్కడికి వెళ్ళాడో తెలీదు" అంది కసిగా. కూతురి కాపురం కుప్పకూలిపోయిందని తెలియడంతో ఆవిడ నిగ్రహాన్ని కోల్పోయింది. బిడ్డను సమదాయించబోయి మరేదో అన్నది.

తల్లి మాటలేవీ ప్రభకు వినిపించడంలేదు. గతం కళ్ళ ముందు కదలాడసాగింది.

★ ★ ★

తండ్రిలేని పిల్ల ప్రభ. ఆమెను ఎంతో అపురూపంగా పెంచింది జగధీశ్వరి. కుటుంబ పోషణకు ఆమె చెయ్యని పనంటూలేదు. ఇకనుంచైనా తల్లిని శ్రమ పెట్టకూడదనుకుని ఒక కాన్వెంటు స్కూల్లో టీచరుగా చేరింది ఇంటర్ వరకు చదూకున్న ప్రభ. నెల నెల కూతురు అంతో ఇంతో పట్టుకురావడంతో జరుగుబాటుకు లోటు లేకుండాపోయింది. ఎటొచ్చి ఈడొచ్చిన పిల్లకి పెళ్లి చేయలేకపోతున్నాననే వ్యధ మాత్రం జగధీశ్వరిని అనుక్షణం కృంగదీస్తోంది. ఎలాగైనా పదో పాతికో వెనకేయాలన్న ఉద్దేశంతో కూతురు వద్దంటున్నా వినకుండా ఉంటున్న ఇంటిని రెండు భాగాలు చేసి ఓ గది అద్దెకిచ్చింది.

"మనింట్లో దిగిన కృష్ణ ఎంతో బుద్ధిమంతుడిలా ఉన్నాడు కదూ!" మాటల్లో అన్నది జగధీశ్వరి.

"దిగి నెల రోజులు కాలేదు. అప్పుడే ఎలా చెప్పేస్తున్నావ్? ఓ నెల అద్దె అడ్వాన్సుగా ఇచ్చాడనా?" నవ్వుతూ అన్నది ప్రభ.

"అన్నం ఉడికింది లేందీ చెప్పడానికి ఒక్క మెతుకు చూస్తే చాలదూ!"

తల్లి మాటలకు పెదవి విర్చి ఊరుకుంది ప్రభ.

రాను రాను జగధీశ్వరికి కృష్ణబాబు పట్ల అవ్యాజమైన అభిమానం ఏర్పడింది. అంతటితో ఊరుకోకుండా అతడి పూర్వాపరాలు కూడ ఆరా తీసింది.

అతడేంచేస్తున్నాడోగాని ఉదయం వెళ్ళిన మనిషి రాత్రికిగాని రాడు. వస్తూనే మంచమెక్కేస్తాడు. మరునాడు ఎనిమిదైతేగాని లేవడు. మనిషి సింపుల్‌గా ఉండటంవల్ల పెద్దగా ఆర్జిస్తున్నాడనుకోలేం.

సందర్భం ఉన్నా లేకున్నా ఏదో ఒక పిండివంట చేసి కృష్ణకి ఆప్యాయంగా పెట్టేది జగధీశ్వరి. అతడు ఊఁ అంటే తన అల్లుణ్ణి చేసుకోవాలన్న కోరిక కూడ లేకపోలేదు. అందుకే ఒకరోజు 'కృష్ణమీద నీ అభిప్రాయం ఏమిటని' కూతుర్ని అడిగేసింది.

"పరవాలేదు మంచివాడే. అలా అన్నానని ఆయన్ని మరీ నెత్తినెక్కించుకోకు. ఎక్కడున్నవాళ్ళని అక్కడ ఉంచితేనే మంచిది. ముందు అతడివ్వవలసిన రెండు నెలల అద్దె సంగతి చూడు. అడక్కపోతే అసలివ్వడు" కర్తవ్యాన్ని గుర్తు చేసింది ప్రభ.

మరి మాట్లాడలేదు జగధీశ్వరి.

రాత్రవుతోంది. తెల్లవారుతోంది. కాలంలో మార్పేంలేదు.

"నిన్నటి నుండి కృష్ణగారి గది తలుపులు మూసే ఉన్నాయి."

ప్రభ మాటల్లో ఆంధోళన వ్యక్తమౌతోంది.

"క్యాంపు వెళ్ళాడేమో!.. అయినా అతడి ఊసు మనకెందుకు? ఎక్కడున్నవాళ్ళని అక్కడే ఉంచాలి" కూతురి మాట కూతురికప్పజెప్పింది జగధీశ్వరి.

"అదికాదమ్మా లోపలనుంచి సన్నగా మూలుగు వినిపిస్తోంది. ఆయనకు ఒంట్లోగాని..."

"దానికి మనమేం చేస్తాం? ఆరోగ్యం బాగుండకపోతే డాక్టరు దగ్గరకు వెళ్ళాలన్న ఇంగితం అతడికుండాలి."

"లేవలేకపోతున్నాడేమో, మనింట్లో ఉంటున్న మనిషిని మనమే పట్టించుకోకపోతే ఇంకెవరు చూస్తారు చెప్పు."

ఆ మాటతో కూతురు కృష్ణను ఇష్టపడుతున్నట్లు అర్థమైపోయింది జగధీశ్వరికి. వెంటనే కాఫీ కలిపి అతడికిమ్మంది.

ప్రభ అక్కడితో ఊరుకోకుండా డాక్టర్ని కూడ పిలుచుకొచ్చింది.

కృష్ణ కాస్త కోలుకున్నాకా ఇహ ఆలశ్యం ఎందుకని డైరెక్టుగా అతడి ఉద్దేశాన్ని అడిగేసింది జగధీశ్వరి.

"నాకు సరైన ఉద్యోగమేదీలేదు. కట్టుకున్న వ్యక్తిని కడదాకా పోషించగలనన్న నమ్మకంలేదు. అటువంటప్పుడు.." అంటూ ఆగాడు కృష్ణబాబు.

"మీకాబెంగేంవద్దు. నేను చిన్నో చితకో ఉద్యోగం చేస్తున్నాను. ఉండటానికి ఇల్లుంది కాబట్టి అద్దెబాధ లేదు. మీరు నన్ను మనస్ఫూర్తిగా కోరుకుంటే చెప్పండి. జీవితాంతం మీకు తోడుగా ఉంటాను." ప్రభ కూడా నిర్మొహమాటంగా తన అభిప్రాయం వెలిబుచ్చింది.

మరి మాట్లాడలేదు కృష్ణబాబు.

జగధీశ్వరి ఆశీశులతో మరునాడే ఇరువురూ ఒకట



యా్యరు.

* * *

గతం నుంచి వర్తమానంలోకొచ్చింది ప్రభ.

వచ్చిన మహిళ ఇంకా అక్కడే నిలబడి ఉండటం గమనించి, "నిన్నూ పిల్లల్ని ఆయన ఎందుకు వది లేసారు?" అని అడిగింది సానుభూతిగా.

"ఏం చెప్పమంటావు తల్లీ. నా కర్మ. నా పాపం. దరిద్రం మహాపాపం అంటారు. దానినుంచి తప్పిం చుకోడానికే కట్టుకున్నవాడు నన్ను వదిలిపెట్టిపో యాడు. ఒక్కమాటలో చెప్పాలంటే నా మొగుడు ఒట్టి పిరికివాడు. బాధ్యతలనుంచి తప్పించుకోవడం కోసమే మా బరువు దింపుకున్నాడు. పెళ్లికి ముందు నాకోసం, ఆ తర్వాత సంసారం కోసం నేనే కష్టపడు తున్నాను. కేవలం తన జేబు ఖర్చులకోసమే అత డేదో పని చేసేవాడు. అయితే ఏనాడూ తన సంపా దనలో ఒక్క పైసా నామీదగాని పిల్లలమీదగాని వెచ్చిస్తే ఒట్టు. ఓ రోజు చంటిదానికి వళ్ళు మరిగిపో తూవుంటే ఆస్పత్రికి తీసుకెళ్ళమన్నాను. ఆ స్థితిలో కూడ మందులు కొనడానికి డబ్బులు లేవని తప్పిం చుకున్నాడు. దాంతో నాకు వళ్ళు మండిపోయింది. రోషం ముంచుకొచ్చింది.

బిడ్డ ఏమైపోతుందోనన్న బాధలో నేనేమన్నానో నాకే గుర్తులేదు. దాంతో అతడి అహం దెబ్బతిన్నట్లుంది. ఈ నరకంలో నేనిక ఉండలేనంటూ బంధాలన్నీ తెంచుకుని పారిపోయాడు. కన్నప్రేమతోనైనా బిడ్డల్ని చూట్టానికి తిరిగొస్తాడనుకున్నాను. రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ఆశ కూడ చచ్చిపోయింది. జాలి, కనికరం లేని బండమనిషి గురించి నువ్వింకా ఎందుకు తపనపడుతున్నావని మీరడగొచ్చు. నాకు అటువంటి మొగుడు లేకపోయినా ఫరవాలేదు. కాని నా పిల్లలకు మాత్రం తండ్రి ఉండాలి. వాళ్ళని నాన్న లేని వాళ్ళను చేయలేను. అందుకే ఈ అన్వేషణ. మొన్న ఎప్పుడో మా ఊరు సర్పంచిగారు ఆయన్ని ఇక్కడ చూసా రట. నా చెవిలో వేసారు. అందుకే పరుగెత్తుకుంటూ వచ్చాను" కంట తడిపె డుతూ తన గోడు చెప్పు కుంటూ వుంటే ప్రభ కళ్ళు కూడ చెమ్మగి ల్లాయి.

"చూడమ్మా ఆయన ఇప్పుడు ఇక్కడ లేరు. నువ్వు ఎక్కడ వస్తావోనని మాయమయ్యారు. ఒక వేళ ఎప్పుడైనా తిరిగొస్తే నీ దగ్గరకు వెళ్ళమని బ్రతిమాలుతాను. నా మాట నమ్ము. నీకు నీ పిల్లలకు అన్యాయం జర గదు. అలా అని ఊరుకో కుండా నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. ఎక్కడైనా తారసపడవచ్చు" కళ్ళు వత్తుకుంటూ అన్నది ప్రభ.

వెళ్ళిపోయింది కమల.

కూతురి పరిస్థితికి కడుపు తరుక్కుపోయిన ట్లైంది జగదీశ్వరికి.

"ఏవిటే ఆ మాటలు, నువ్వే నీ భర్తని దానికి అప్పగిస్తానంటా వేంటి. నీకేమైనా బుద్ధుందా?" చీవా ట్లేసింది మరి ఉండలేక.

"నాకు ఇంగితం ఉండబట్టేనమ్మా ఆ మాట అన్నాను. మొగవాడు అర్జనప రుడు కాకపోయినా ఆడది సర్దుకుపోతుం దేమోగాని పిరికివాడితో మాత్రం మనువుకు ఇష్ట పడదు. కృష్ణ పిరికివాడే కాదు మోసగాడు కూడ. తనకు పెళ్లైందన్న విషయాన్ని కప్పిపుచ్చి నన్ను పెళ్లి చేసుకుని, ఆ నిజం ఎక్కడ బయటపడిపోతుం దోనని భయపడి చెప్పాపెట్టకుండా పారిపోయాడు. అటువంటి పిరికివాడు, నయవంచకుడు నాకక్కర్లే దమ్మా. నాకు భర్తగా కాకున్నా ఆ పసికందులకు తండ్రిగా ఉంటే అంతేచాలు. నాకు సంతానం కలగక ముందే నిజాన్ని బయటపెట్టించి భగవంతుడు నాకెంతో ఉపకారం చేసాడు" అంటూ గేటు మూసింది ప్రభ.

★